విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

పత్రికా రంగానికి రామోజీరావు దిక్సూచి

కలెక్టర్ కృషి అభినందనీయం

విశాలాంధ్ర-ఏలూరు : ఏలూరు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా కలెక్టర్ కృషి స్ఫూర్తి దాయకం, అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తో పాటు పలువురు రిటర్నింగ్ అధికారులు అన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసిన సంద ర్భంలో జిల్లాలోని వివిధ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు జాయింట్ కలెక్టర్ పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జెసి లావణ్య వేణి మాట్లాడుతు సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగడానికి చిత్తశుద్ధితో పని చేసి వృత్తి ధర్మాన్ని పారదర్శకంగా పాటిస్తూ, ఎవ్వర్ని నొప్పించకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందనీయులన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నుంచే కాకుండా అంతకు ముందు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు ఐటిడిఎ పిఓ యం.సూర్య తేజ,ఆర్డీవో లు ఎన్ ఎస్ కె ఖాజావలి,వై.భవానీ శంకరీ,కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె. భాస్కర్, యం.ముక్కంటి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి కలెక్టర్ పూల మొక్కలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిసిన డీఎస్పీ

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : నూతన శాసన సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను డి.ఎస్.పి. ఆర్. వి. ఎన్. మూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సబ్ డివిజనల్ ఆఫీసర్ డి ఎస్ ఆర్ వి ఎన్ మూర్తి నీ కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం టౌన్ సిఐ ఏ. సుబ్రహ్మణ్యం, టౌన్ ఎస్ఐ జేబీఎన్. ప్రసాద్, తాడేపల్లిగూడెం రూరల్ సీఐ ఏ. రమేష్, రూరల్ ఎస్సై, పి. సురేష్, పెంటపాడు ఎస్సై ఎస్. శంకర్ , తదితరులు పాల్గొన్నారు.

బి.వి.రాజు వర్ధంతి - సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర -భీమవరం: శ్రీ విష్ణు విద్యా సంస్థల వ్యవస్థాపకులు పద్మశ్రీ, డాక్టర్ బి.వి.రాజు 22వ వర్ధంతిని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శృంగవృక్షం లెప్రసీ సెంటర్‌లోని 100 మంది రోగులకు నిత్యావసర వస్తువులు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. పట్టణంలోని సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్ లోని టిబి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఏభై వేల రూపాయలు మందులు, పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం సెయింట్ మేరీస్ ఆసుపత్రిలోని ఏభై మంది రోగులకు మందులు, పండ్లు, పాలు బ్రెడ్ పంపిణీ చేశారు. 7వ వార్డు లెప్రసీ కాలనీలోని 1400 మందికి నెలవారీ పింఛన్లు, నిత్యావసర వస్తువుల, పళ్ల పాలు బ్రెడ్ పంపిణీ చేశారు. తొలుత శ్రీ విష్ణు విద్యా సంస్థల ప్రాంగణంలోని బి.వి.రాజు సమాధి వద్ద, బి.వి.రాజు మార్గ్ సెంటర్ లో ఆయన విగ్రహానికి విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో విద్యా సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-టి.నరసాపురం: విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని బంజారా భజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. కృష్ణాపురం గ్రామంలో బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను శనివారం ఘనంగా సన్మానించి విద్యార్థులకు చేతక్ మెరిట్ స్కాలర్ షిప్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజపుత్ర స్వతంత్ర పోరాట యోధుడు మహా రాణా ప్రతాప్ స్వారీ చేసిన చేతక్ పేరు కలిగిన గుర్రం ప్రపంచంలోనే అత్యంత బలశాలి, వీర పరాక్రమం కలిగినదిగా ప్రసిద్ధి పొందిందని అన్నారు. ఈ చేతక్ గుర్రం యుద్ధ రంగంలో రాణించినట్లు విద్యార్థులు తమ చదువుల్లో ఉన్నత ప్రతిభను సాధిం చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంజారా భజ రంగీ భేరీ సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణ ప్రసాద్, చందా నాయక్, పూర్ణయ్య, వెంకా నాయక్, రమేష్ నాయక్, బిగనాధం నాయక్, రాజా నాయక్, ప్రమీలా దేవి, రవి నాయక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కె జగ్గవరం సొసైటీ చైర్‌పర్సన్ మధు రాజీనామా

విశాలాంధ్ర-టి నరసాపురం: కె జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు స్థానిక సొసైటీలో శనివారం తన రాజీనామా పత్రాన్ని సిఇఓ తనగాల వీర వెంకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పదవీ కాలంలో సొసైటీ అభివృద్ధికి సహకరించిన సంఘ పర్సన్ లకు, రైతులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర -ముదినేపల్లి : గత 24 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతో ఆహ్లాదాన్ని నింపింది. ముదినేపల్లి తృతీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ముగింపు సందర్భంగా లిటిల్ ఫ్లవర్ ఇ ఎం స్కూల్ రిటైర్డ్ టీచర్స్ పాండురంగారావు, మల్లికార్జున రావు పాల్గొన్నారు. 24 రోజులుగా విద్యార్థిని విద్యార్థులకు పాటలు, పద్యాలు వివిధ రకాలైన ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ధృవీకరణపత్రాలు ప్రతిరోజు హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరసా అంకిత , లైబ్రేరియన్ ఎం. శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బొలిశెట్టికి 'మానవత' అభినందనలు

విశాలాంధ్ర -పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్ రావు, మానవతా సభ్యులు మర్యాద పూర్వకంగా కలసి అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా మానవతా చేస్తున్న వివిధ రకాలైన సేవలను శాసనసభ్యు లకు వివరిం చారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 25వేల మంది సభ్యులతో 109 మండలాలలో అత్యున్నతమైన సేవలను అందిస్తున్నామన్నారు. శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవతా వారు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, రాబోయే కాలంలో మానవతకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా మోహన్ రావు ఎమ్మెల్యే బొలిశెట్టికి ధన్యవాదములు తెలియజేశారు. కార్యక్రమంలో పెంటపాడు మండలం మానవతా సభ్యులు నక్క సాంబశివరావు, దాసరి అప్పన్న, కిలపర్తి వెంకట్రావు,పి.బి శ్రీనివాసచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐజేయూ సంతాపం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత సి.హెచ్.రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని, ఆయన మృతితో తెలుగు పత్రికారంగం ఒక దిక్సూచిని కోల్పోయిందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ.జే.యు.) జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. డెబ్భయ్యవ దశకంలో ఈనాడు పత్రికను స్థాపించడం ద్వారా తెలుగు పత్రికా రంగంలో నూతన ఒరవడిని ప్రవేశపెట్టి ఆ రంగానికి జవసత్వాలను సమకూర్చా రని, ఈనాడు నమూనా విజయవంతం కావడంతో మిగిలిన పత్రికలకు అది ఒక ఒక ప్రమాణంగా నిలిచిందని , ఆ రకంగా తెలుగు పత్రికారంగ చరిత్రను రామోజీరావు తిరగరాసారని డి.సోమసుందర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా తెలుగుపత్రికా రంగంలో వృత్తి విలువలను , ప్రమాణాలను, భాషా నైపుణ్యాలను, పెంపొందించడానికి నిరంతర శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నిపుణులైన కొత్తతరం జర్నలిస్టులను ఆయన తయారు చేసారని, తద్వారా పత్రికారంగంపై తనదైన గాఢమైన ముద్ర వేశారని సోమసుందర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు మృతికి సోమసుందర్ సంతాపం తెలుపుతూ కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి సానుభూతి తెలిపారు.

కామవరపుకోటలో : తెలుగు రాష్ట్రాల్లోనే కాక భారతదేశ వ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందిన రామోజీరావు మరణం అత్యంత బాధాకరం అని చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ అన్నారు. శనివారం కామవరపుకోటలో సొసైటీ పెట్రోల్ బంక్ దగ్గర ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ పచ్చళ్ళు దగ్గర నుంచి న్యూస్ పేపర్ వరకు, సినిమా నిర్మాణం నుంచి ప్రపంచ స్థాయి స్టూడియో వరకు ఆయన బలమైన ముద్ర వేసారన్నారు. ఆయన తెలుగు నేలకు తెలుగు ప్రజలకు చేసిన కృషి అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఘంటా మాధవరావు, కొయ్యగూర వెంకటేష్, కంతమనేని అంజిమూర్తి, అభిమానులు పాల్గొన్నారు.

పెదవేగిలో : జర్నలిజం ద్వారా సమాజ శ్రేయస్సు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, పేద వాడి సమస్యల పరిష్కారం కోసం ఈనాడు పేపర్ ద్వారా, ఈటివి ద్వారా అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుడు రామోజీ రావు ఆయన అస్తమించారు అనే వార్త చాలా బాధాకరం - వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అటు పత్రికా రంగంలో, ఇటు ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో జర్నలిజం పట్ల విశ్వసనీయతకు మారు పేరుగా సుదీర్ఘ కాలంగా సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన అస్తమయం తెలుగు వారందరికీ ఎన్నటికీ తీరని లోటన్నారు. రామోజీ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లింగపాలెంలో : అక్షర యోధుడు, పత్రికారంగ అధిపతి ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతిపై చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ సంతాపం తెలిపారు. ఈయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామోజీ గురించి మాట్లాడుతూ దేశానికే ఆదర్శమూర్తి రామోజీరావు అంటూ కొనియాడారు. పత్రికా రంగం ద్వారా ఈయన చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకమని అన్నారు.పత్రికా రంగం ద్వారా అక్రమాలు, అన్యాయాలపై ఈయన చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు.

భీమవరంలో: ఈనాడు దినపత్రిక అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త చెరుకూరి రామోజీరావు సంతాప సభ శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు అధ్యక్షతన టిడిపి కార్యకర్తలు వివిధ సంఘాలు రాజకీయ పార్టీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ జగన్ అవినీతిని తన పత్రిక ద్వారా ఎండగట్టిన రామోజీరావు సొంతం అని ఒక సామాన్య కుటుంబంలో రామోజీరావు జన్మించి ప్రపంచ గుర్తింపు పొందారని అన్నారు. కార్యక్రమం నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 1936లో ఒక రైతు కుటుంబంలో రామోజీరావు జన్మించారని మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీని ఏర్పాటు చేసి ఈనాడు పత్రికను స్థాపించి అక్షరాన్ని ఆయుధంగా మలిచి ప్రజా చైతన్యం చేసిన రామోజీరావు ను పాత్రికేయ రంగం నిరంతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. .టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జిల్లా బీసీ సంఘం నాయకులు గంటా త్రిమూర్తులు, జనసేన రాష్ట్ర నాయకులు మల్లినీడి తిరుమలరావు బాబి, బిజెపి నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్ , పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ ,చైతన్య భారతి భట్టిప్రోలు శ్రీనివాసరావు ,టిడిపి నాయకులు కోంద్రు శ్రీనివాస్, నీలాతి రమేష్ , విజ్జురోతి రాఘవులు, ఎన్సిసి మెజర్, డాక్టర్ ఎ.వీరయ్య , రాష్ట్ర మున్సిపల్ మినిస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కృష్ణ మోహన్ తదితరులు రామోజీరావు సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు .

నిడమర్రులో : ప్రముఖ ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావుకు శనివారం క్రొవ్విడి గ్రామంలో ఘన నివాళులు అర్పించారు. నిడమర్రు మండల టీడీపీ అధ్యక్షుడు ముత్యాల స్వామి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు సత్తినీడి నాని, ఏలూరు జిల్లా తెలుగు యువత కార్యదర్శి మహమ్మద్ గఫర్ ఖాన్, ఏలూరు జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సంబంగి రంగారావు సన్నాల శివశంకర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తణుకులో: మీడియా మొగల్ తెలుగు వెలుగు ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆయన మరణం తెలుగు వారికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి తీరనీ లోటని తణుకు నియోజకవర్గ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రు-నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదిగి అన్ని రంగాల్లోనూ తనదైనటువంటి ముద్ర వేసుకుని ప్రపంచంలో ఒక ప్రత్యేకమైనటువంటి గుర్తింపు పొందిన వ్యక్తి రామోజీరావని అన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ పార్టీ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, పార్టీ నాయకులు చుంచుల వెంకటేశ్వరరావు, కంటిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో : నరసాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రామోజీరావు మృతికి చింతిస్తూ సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక రంగంలో విప్లవాత్మమైన మార్పులు తీసువచ్చారన్నారు. ఫిలింసిటీ ఏర్పాటు చేసి ప్రపంచ ఖ్యాతి గడించారన్నారు. తెలుగు భాష గొప్పదనాన్ని చాటిన మహనీయుడు అన్నారు. సీనియర్ జర్నలిస్టు సిహెచ్ వేంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మద్దాల మురళీ, పోతురెడ్డి రాము, కరీంశెట్టి శ్రీనివాసు, అధికారి కొండబాబు, చెరుకూరి రాజేష్,ఆనందరాజు, పండు, విజయ్,దివి వేంకటేశ్వర రావు, భగవాన్, రాజారమేష్ తదిరులు పాల్గొన్నారు.

నూజివీడులో : ఈనాడు సంస్థల అధినేత, ప్రముఖ సినీ నిర్మాత, పద్మ విభూషణ్ రామోజీరావు మరణ వార్త అత్యంత బాధాకరం వారి ఆత్మకు శాంతి కలగాలని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు,మాజీ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. శనివారం నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే సారధి, తెలుగుదేశం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సారధి మాట్లాడుతూ తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత రామోజీరావుకు దక్కుతుందన్నారు. .రామోజీఫిల్మ్ సిటి ప్రపంచంలోనే గర్వంగా చెప్పుకునే మన తెలుగురాష్ట్రాల్లో ఉన్న స్టూడియో అని మార్గదర్శి, ప్రియా ఫుడ్స్ ఇలా ఎన్నో సంస్థల ద్వారా ఎంతో మందికి ఉపాధికల్పించారని సారధి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు , తెలుగుదేశం,జనసేన, బిజెపి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో : రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని పాలకోడేరు మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి రాగూర్ కోటేశ్వరరాజు అన్నారు. రామోజీరావు మృతిని పురస్కరించుకుని పాలకోడేరు మండల టిడిపి కార్యాలయంలో శనివారం రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో మారుమూల గ్రామంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. అలాంటి వ్యక్తి ఈరోజు మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో: మీడియా దిగ్గజం, ఈనాడు పత్రిక అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. రామోజీరావు మృతి పట్ల శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొయ్యలగూడెం పట్టణ మండల అనుబంధ కమిటీల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలాదేవి, పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు, మంచాల వెంకయ్య నాయుడు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండిలో : ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి దురదృష్టకరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంట గ్రామంలో రామోజీ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో నూతన వరవడి సృష్టించి తెలుగు జాతి గర్వించ దగ్గ వ్యక్తి రామోజీరావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమణి పాండురంగారావు, కోకా తాతయ్య, ఒడుగు గణపతి తదితరులు పాల్గొన్నారు.

దళితులు విద్యకు ప్రాధాన్యతనివ్వాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : దళిత సోదరులంతా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, తమ పిల్లలను మంచి చదువులు చదివించి ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా వారిని తయారు చేయాలని మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి. దేవపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలో అంకాల గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు, మాజీ ఎంపీ టీసీ కునపాము రాజా రత్నం ఇంటి వద్ద దళితుల ఆత్మీయ కలయిక సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఏలూరు జిల్లా మేడ్ అధ్యక్షులు లాగు జయరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవపాల్ మాట్లాడుతూ దళిత సోదరులంతా తమ పిల్లలను చదువులలో ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా చదివించాలని తల్లిదండ్రులు ప్రభుత్వం ద్వారా అందించే అన్ని అవకాశాలు అందిపుచ్చుకొని విద్య,ఉపాధి, సంక్షేమ రంగాలలో తమ పిల్లలకు ప్రోత్సాహాన్ని అందించాలని పలు సూచనలను తెలిపారు. కార్యక్రమంలో మేడ్ జిల్లా ఉపాధ్యక్షులు కొక్కిరపాటి మధు, పోలవరం నియోజకవర్గ అధ్యక్షులు కునపాము సూర్యారావు,తదితరులు పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్ డైరెక్టర్ పదవికి రాజీనామా

విశాలాంధ్ర-లింగపాలెం: లిడ్ క్యాప్ డైరెక్టర్ గా ఉన్న వైసీపీ నాయకుడు సొంగ సందీప్ తన పదవికి రాజీనామా చేశారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంకు చెందిన ఈయనను వైసీపీ ప్రభుత్వం ఈ పదవిలో నియమించింది. రాష్ట్రంలో కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో సందీప్ తన పదవికి రాజీనామా చేశారు.

విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గం లో జనసేన పార్టీ అభ్యర్థి చిర్రి బాలరాజు అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొంద దంతో మండలంలో దిప్ప కాయలపాడు, కొయ్యలగూడెం గ్రామాలలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు విజ యోత్సవ ర్యాలీని నిర్వహిం చారు. విజయోత్సవ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందడానికి మంచి రోజులు వచ్చాయని, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK ABZAL (New Name), S/o SHAIK ABDUAL AZEEZ, Previously called SHAIK AFZIL (Old Name), S/o SHAIK ABDUAL AZEEZ, Resident of D.No.4-139, Jamal Street, Near Masque, Sanivarapupeta, Eluru Mandal-534003, Eluru District, A.P. Now Changed my name from SHAIK AFZIL (Old Name), S/o SHAIK ABDUAL AZEEZ TO SHAIK ABZAL (New Name), S/o SHAIK ABDUAL AZEEZ. Today onwards Use my New Name for all further Transactions.

విగ్రహాల తొలగింపు దారుణం

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: బీజేపీ నిరంకుశ, స్వార్థపూరిత,మతతత్వ, కుటిల రాజకీయాలకు పరాకాష్టే పార్లమెంట్ ఆవరణలో గాంధీ,అంబేద్కర్, ఛత్రపతి శివాజీల విగ్రహాల తొలగింపు అని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. శనివారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఆవరణలో మహనీయుల విగ్రహాల తొలగింపు నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెఎన్వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ముస్లిం మైనారిటీ నాయకుడు ఛాన్ భాషా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిరుమాని కామేశ్వరరావు మాట్లాడుతూ దేశ ఔన్నత్యానికి, ప్రతిష్టకు, మతసామరస్యానికి, లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి,దేశ చరిత్రకు ప్రతిరూపాలుగా నిలిచిన మహనీయుల విగ్రహాల తొలగింపు బీజేపీ మతోన్మాద పాలనకు అద్దం పడుతుందన్నారు. ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనం ప్రజల సందర్శనార్థం మ్యూజియంగా తీర్చిదిద్దుతామని చెపుతున్న ప్రభుత్వం గాంధీ, అంబేద్కర్ ఛత్రపతి శివాజీ లాంటి మహనీయుల విగ్రహాలను మాత్రమే తొలగించి బిర్సాముండా, మహరాణ ప్రతాప్ లాంటి మరికొందరి విగ్రహాలను యథాస్థానంలో వుంచడంలో బీజేపీ అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తొలగించిన మహనీయుల విగ్రహాలను యథాస్థానంలో వుంచాలని డిమాండ్ చేశారు.

రామోజీరావు మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటు

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: తెలుగు జర్నలిజంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి ఈనాడు దినపత్రికను సామాన్యుల గొంతుగా మలచిన అక్షర యోధుడు రామోజీరావు మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతికి భీమారావు తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పత్రికారంగంలోనే కాకుండా సినీ రంగంలోను తనదైన ముద్ర వేశారన్నారు. హైదరాబాద్ లో నిర్మించిన రామోజీ ఫిల్మ్ సిటీ అంతర్జాతీయ ఖ్యాతి గడించిందన్నారు. మద్యపాన నిషేధం లాంటి సామాజిక ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారని, తుఫానులు,వరదలతో నష్టపోయిన వారికి ఆయన ఆపన్నహస్తం చూపించారని ఎంతోమందికి గృహాలు నిర్మించి తన మానవీయతను చాటుకున్న మానవతావాది రామోజీ మృతి అత్యంత బాధాకరమన్నారు.

ప్రజా నాట్య మండలి సంతాపం: ఈనాడు అధినేత రామోజీరావు, అభ్యుదయ రచయత శ్రీశ్రీ కుమారుడు వెంకటరమణ, కామవరపుకోట సిపిఐ నాయకులు టీ.వీ.ఎస్.రాజు కుమారుడు రామకృష్ణ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లాసమితి తరపున జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు ఓటమి తెలియని వ్యాపారవేత్తగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి నిరాడంబర జీవితాన్ని గడిపారని సీతారాం ప్రసాద్ కొనియాడారు. శ్రీ శ్రీ కుమారుడు వెంకటరమణ సమాజానికి అందిస్తున్న సేవలు మరువరానివని, విశాలాంధ్ర విలేకరిగా రామకృష్ణ అందించిన సేవలను ఆయన గుర్తు చేశారు.

ఆందోళనలో గురుకులాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

నిబంధనలకు విరుద్ధంగా రెన్యువల్స్
ఇబ్బందుల్లో 800కు పైగా కుటుంబాలు
గత ప్రభుత్వం పట్టించుకోని వైనం-నేటి ప్రభుత్వంపై కోటి ఆశలు

విశాలాంధ్ర -ముదినేపల్లి : 2019 నుండి అంబేద్కర్ గురుకుల ఉపాధ్యాయులు , జె ఎల్స్ , పిజిటి , టిజిటి మొదలైన వారికి కనీస వేతనంతో పనిచేస్తున్నారు. సుమారు ఎనిమిది వందలకు పైగా కుటుంబాలు జీవనోపాధికి ఆధారపడి ఉన్నారు. ఇందులో పనిచేసే వారు ఇప్పటికీ 40-50 సంవత్సరాలు పైబడిన వారే ఉన్నత విద్యను అభ్యసించి ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లేక గురుకులాల్లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారు. గత సంవత్సరం నుండి వారికి మే నెల జీతం రావడం లేదు. ఎందుకని సొసైటీ వారిని ప్రశ్నించగా ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆమోదం పొందలేదని చెప్తున్నారు. ఈ డిపార్ట్మెంట్ తో ఆమోదం పొందించాల్సిన బాధ్యత సొసైటీ వారిదే. తమ సమస్య పరిష్కరించమంటే రెన్యువల్ చేయమని కోరితే నివారిస్తున్నారు. దీనిపై కోర్టును ఆశ్రయిస్తే మే 27న రెన్యువల్స్ ఆర్డర్స్ జారీ చేసిన , నిబంధనలను విరుద్ధంగా జూన్ 12న రెన్యువల్ ఇవ్వడం గమనార్హం. సంబంధిత శాఖ స్పందించి 10 రోజుల బ్రేక్ అప్ తో రెన్యువల్స్ ఇచ్చే విధంగా తమకు న్యాయం చేయాలని అంబేద్కర్ గురుకులాల్లో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సిపిఎఫ్ ఫ్యాక్టరీ ఎదుట ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర - గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా గణపవరం (సరిపల్లె) గ్రామంలో గత 11 సంవత్సరాలుగా సిపిఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫీడ్ మిల్లు చేపలు, రొయ్యలు మేతల తయారీ పరిశ్రమ థాయి లాండ్ దేశానికి చెందిన కంపెనీ బారి లాభాలతో ఫ్యాక్టరీని నడిపారు. కానీ నాడు భారతదేశ వ్యాప్తంగా ఉన్న ఫ్యాక్టరీలు లాభాల బాటలో నడుస్తున్నాయి. గణపవరం (సరిపల్లె) గ్రామంలో ఉన్న ఫ్యాక్టరీ మాత్రం నష్టాల్లో ఉందని యాజమాన్యం సాకును చూపించి గణపవరం ఫ్యాక్టరీని థాయిలాండ్ యాజమాన్యం మూసి వేసింది. అందులో పని చేసే ఉద్యోగులు, కార్మికులు తమకు న్యాయం చేయాలని కోరుతూ రెండో రోజు అయిన శనివారం సిపిఎఫ్ పార్టీ ఎదుట రోడ్డుపై నిరసన తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరి మానుకుని ఉద్యోగులకు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి తగు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగులు కార్మికులు కుటుంబాలు ఫ్యాక్టరీ మూసివేయడంతో రోడ్డున పడ్డామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఫ్యాక్టరీ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

విశాలాంధ్ర-భీమడోలు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని వినియోగదారుల చట్టం జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఘనంగా ముగిశాయి. గ్రంథ పాలకుడు కే శ్రీనివాసా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ, మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా కెరియర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, జిల్లా ఇన్‌చార్జి పివి సత్యనారాయణ, సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయ సారథి, వినియోగదారుల చట్టం పరిశీలకులు ఉప్పు గంగాధరరావు, బొడ్డుపల్లి తులసిరామ్, పెద్దలు కె. చాలామయ్య, డి. చంద్రకళ, 4 5మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు. శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన 40మందికి బహుమతులు అందజేశారు.